క్లుప్తంగా

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని గురుకుల పాఠశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద మంగళవారం తెలిపారు. సదస్సుకు సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆయేషా సరీన విద్యార్థినులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మునగాల: మండల కేంద్రంలో కేజీబీవీ, జూనియర్ కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారి సునీతారాణి మంగళవారం తెలిపారు. 2024–25లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం కోర్సు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రవేశం పొందిన విద్యార్థినులకు ఉచిత వసతి, భోజన సౌకర్యంతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

కేజీబీవీలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

పాలకవీడు: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించేందుకు విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల, కళాశాల ప్రత్యేకాధికారిణి సుజాత మంగళవారం తెలిపారు. ఇంటర్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూ, సీఈసీ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

మొక్కలు నాటాలి



నేరేడుచర్లలో మొక్కలు నాటుతున్న సిబ్బంది

నేరేడుచర్ల : ప్రతి ఒక్కరూ మొక్క నాటి వాటిని సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం నేరేడుచర్ల మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో రామాపురంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమం 51వ రోజుకు చేరుకుందని తెలిపారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే- డ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

దివ్యాంగుల జీవనోపాధికి రుణాలు

భానుపురి (సూర్యాపేట) : దివ్యాంగుల జీవనోపాధికి ఆర్థిక ప్రోత్సాహక పథకం కింద రుణాలు అందించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. వంద శాతం రాయితీతో రూ.50వేల నుంచి రూ.2లక్షల వరకు 22 యూనిట్లు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన దివ్యాంగులు gobmms.cgg.gov.in వెబ్ సైట్‌లో ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సీసీ కెమెరాలు ప్రారంభం



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న సీఐ

మేళ్లచెరువు : మండలంలోని వెల్లటూరు గ్రామంలో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, ఎస్ఐ పరమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రామస్తుల సహకారంతో గ్రామంలో 12 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేరాలు తగ్గించేందుకు కృషి చేస్తున్న గ్రామస్తులను అభినందించారు.

ఆలయానికి విరాళం

మఠంపల్లి: హుజూర్‌నగర్‌కు చెందిన వాసవీ వనితాక్లబ్ అధ్యక్షురాలు పొలిశెట్టి ఝాన్సీరాణి తన జన్మదినం సందర్భంగా మంగళవారం ఆమె దంపతులు మఠంపల్లి మండలంలోని ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలో గల వాసవీకన్యకాపరమేశ్వరీ దేవాలయానికి రూ.25,116, సత్రంలో పనిచేసే పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రవల్లిక, నిత్యశ్రీ, ఈశ్వరమ్మ, గీత, స్రవంతి, వెంకటలక్ష్మిపద్మావతి, పావని, జయమ్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నడిగూడెం : మండలంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించకపోవడంతో కార్యదర్శులు సొంత డబ్బులతో గ్రామాల్లో పనులు చేయిస్తున్నారని తెలిపారు. తక్షణమే ప్రత్యేక నిధులు కేటాయించి వారి సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు.

పాఠశాల భవనాలు పూర్తయ్యేనా!

- రామాపురంలో పదేళ్లుగా పూర్తికాని పనులు
- రత్నవరంలో ప్రారంభానికి నోచుకోని బిల్డింగ్
- సౌకర్యాలూ కల్పించని అధికారులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు, టీచర్లు



రామాపురంలో నిలిచిన భవన నిర్మాణ పనులు



రత్నవరంలో నిర్మించిన ప్రాథమిక పాఠశాల

నడిగూడెం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తున్నా నడిగూడెం మండలంలో కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు పక్కా భవనాలు లేకుండా పోయాయి. దీంతో ఏళ్ల క్రితం నిర్మించిన శిథిల భవనాల్లోనే విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. అవి కూడా సరిగ్గా లేని గ్రామాల్లో చెట్ల కింద విద్యాబోధన కొనసాగుతోంది. మరికొన్ని చోట్ల కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో ఇటు విద్యార్థులు.. అటు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

భవన నిర్మాణం చేపట్టినా..

మండలంలోని రామాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల కోసం పదేళ్ల క్రితం రూ.36 లక్షల వ్యయంతో నూతన భవన నిర్మాణం చేపట్టారు. కేవలం స్లాబు, గోడల పనులు మాత్రమే పూర్తయ్యాయి. అనంతరం సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపులు లేకపోవడంతో పనులు నిలిపివేశారు. దీంతో ఆ భవనం పదేళ్లుగా నిరుపయోగంగా ఉంటోంది. ఆ పాఠశాల విద్యార్థులకు ఉన్న మూడు గదులు, చెట్లకింద పాఠాలు బోధిస్తున్నారు.

నిర్మించారు.. వదిలేశారు

రత్నవరం గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో మన ఊరు–మన బడి పథకం కింద రూ.26 లక్షల వ్యయంతో నూతన భవనాన్ని నిర్మించారు. కానీ ఆ భవనంలో విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. రంగులు కూడా వేయలేదు. విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్‌లు ఏర్పాటు చేయలేదు. పైగా ఈ నూతన భవనాన్ని ప్రారంభించనూ లేదు. దీంతో ఈ పాఠశాలలో చదువుతున్న 36 మంది విద్యార్థులకు ఉన్న ఒక్క తరగతి గదితోపాటు వరండాలో పాఠాలు చెబుతున్నారు. అలాగే మండలంలోని చెన్నకేశ్వాపురం, కాగిత రామచంద్రాపురం, సిరిపురం, వల్లాపురం, శ్రీరంగాపురం, చాకిరాల గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలలను పాతకాలం నాటి భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న పాఠశాలలకు నూతన భవనాలు నిర్మించి మండలంలో విద్యాభివృద్ధికి కృషిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

పక్కా భవనం లేక ఇబ్బందులు



మా గ్రామ సమీపాన ఉన్న రామాపురం హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాను. మా పాఠశాలలో పక్కా భవనం లేక ఇబ్బందులు పడుతున్నాం. ఉన్న మూడు ఇరుకు గదుల్లోనే పాఠాలు చెబుతున్నారు. మా పాఠశాలలో పదేళ్ల క్రితం పక్కా భవనం నిర్మాణం చేపట్టారు కానీ పూర్తి చేయలేదు. త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలి.

– గంటెపంగు లోకేష్, 9వ తరగతి విద్యార్థి, చాకిరాల

మౌలిక వసతులు కల్పించాలి



మా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఎలాంటి వసతులు లేవు. మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. కొత్త భవనం నిర్మించారు కానీ ఇంకా ప్రారంభించలేదు. ఉన్న ఒక తరగతి గదిలోనే పాఠాలు చెబుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మా పాఠశాలలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలి.

– కాశిమల్ల సంజు, 4వ తరగతి విద్యార్థి, రత్నవరం

వసతుల కల్పనకు కృషిచేస్తున్నాం

అన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తున్నాం. రామాపురం ఉన్నత పాఠశాలలో నెలకొన్న భవనంతోపాటు ఇతర సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. దీంతోపాటు రత్నవరం పాఠశాలలో భవనం సమస్యను ఇప్పటికే విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– బి.ఉపేందర్‌రావు, ఎంఈఓ, నడిగూడెం

పీఎంజేయూజీఏపై అవగాహన



గ్రామసభ ద్వారా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

పాలకవీడు: పోడు భూములు సాగు చేసుకుంటూ ఫారెస్ట్ రైట్ యాక్ట్‌లో భాగంగా పట్టాలు పొందిన రైతులకు కేంద్ర ప్రభుత్వం పీఎంజేయూజీఏ (ప్రధానమంత్రి జన్‌జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్) అమలు చేస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మి తెలిపారు. పథకంలో భాగంగా పాలకవీడు మండలంలో ఎంపికైన కోమటికుంట, జాన్‌పహాడ్, చెరువుతండా, జాన్‌పహాడ్, శూన్యపహాడ్ గ్రామాల్లో మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఆయా ప్రాంతాల్లో జీవనోపాధి మెరుగుపరిచేందుకు అర్హులైన రైతులకు సబ్సిడీ ద్వారా రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఫారెస్ట్ రైట్ యాక్ట్ పట్టా కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి సురేష్, ఫారెస్ట్, పంచాయతీరాజ్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

న్యాయవాది క్రాంతి మృతిపట్ల సంతాపం



కోదాడ కోర్టులో మౌనం పాటిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

కోదాడరూరల్ : న్యాయవాది యాతాకుల క్రాంతి అకాల మరణం బాధాకరమని కోదాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి సురేష్ అన్నారు. రెండు రోజులు క్రితం క్రాంతి డెంగీతో మృతి చెందగా.. మంగళవారం కోర్టులో నివాళులర్పించారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాప సభ ఏర్పాటు చేసి ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్జిలు భవ్య, ఎండీ ఉమర్, ఎస్‌డీ కీయాసుల్తానా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు ఉయ్యాల నర్సయ్య, కార్యదర్శి రామకృష్ణ, సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఆర్‌కె.మూర్తి, వెంకట్రావు, హనుమంతరావు, శరత్‌బాబు, రామిరెడ్డి పాల్గొన్నారు.

సాగర్ ఆయకట్టుకు నీరు విడుదల చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్

హుజూర్‌నగర్ : జిల్లాలోని నాగార్జునసాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ కోరారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎడమ కాలువ పరిధిలోని ప్రధాన మేజర్లు, మైనర్లకు నీటిని విడుదల చేయాలన్నారు. ఇప్పటికే ఆయకట్టులో రైతులు వరి విత్తనాలు చల్లుకుని నీటి కోసం ఎదురు చూస్తున్నారన్నారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, దొంతగాని సత్యనారాయణ, యల్లావుల రమేష్, శివకుమార్, జక్కుల రమణ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి

హుజూర్‌నగర్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ మండల ముఖ్య కార్యకర్తల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలన్నారు. తెలంగాణలో సర్పంచ్, ఎంపీటీసీల పదవీకాలం ముగిసి ఏడాదిన్నర గడుస్తున్నప్పటికీ ఎన్నికలు నిర్వహించకపోవడం కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల, పట్టణ ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ నబీ, బెల్లంకొండ అమర్, సీనియర్ నాయకులు డాక్టర్ కేఎల్‌ఎన్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమరానికి సిద్ధం కావాలి

గరిడేపల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒంటెద్దు నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణనాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, మాశెట్టి శ్రీహరి, పార్థసారథి, స్వప్న, ఎల్లయ్య, ఇసాక్, అంజి, మన్సూర్, భాస్కర్, వెంకట్‌రెడ్డి, హేమ్లానాయక్, సైదులు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యం గర్వించే మహాకవి దాశరథి



హుజూర్‌నగర్ : మాట్లాడుతున్న విజయ్ కుమార్



నేరేడుచర్ల : దాశరథి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

హుజూర్‌నగర్ : తెలుగు సాహిత్యం గర్వించే మహాకవి దాశరథి కృష్ణమాచార్య అని తెలుగు పండిట్ విజయ్ కుమార్, రిటైర్డ్ టీచర్ దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దాశరథి కృష్ణమాచార్యు జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ కవుల గొప్పతనాన్ని చాటుతూ నిజాం నిరంకుశత్వాన్ని తన కలం ద్వారా ఎండగట్టారని తెలిపారు. అనంతరం తెలుగు సాహిత్యం పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని రేకెత్తించే దాశరథి పద్యాలను, కవితలను, పాటలను వారు వినిపించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్ రెడ్డి, రమేష్, నాగుల్ మీరా, నరసింహారావు, నరసింహరాజు, రమణారెడ్డి, శోభారాణి, ఉపేంద్ర, జ్యోతి, తేజ, రవిబాబు, రామ్మూర్తి, గ్రంథపాలకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దాశరథి కృష్ణమాచార్య జయంతి

నేరేడుచర్ల : నేరేడుచర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం మహాకవి దాశరథి కృష్ణమాచార్య జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు, బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు రాపోలు నవీన్‌లు దాశరథి చిత్రపటానికి నివాళులర్పించారు. తెలంగాణ నిజాం నవాబులకు వ్యతిరేకంగా అన్యాయం, అక్రమాలపై ఆయన రాసిన కవితలు మహోన్నతమైనవని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటరమణ. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఇంతియాజ్, కొమ్మరాజు వెంకట్, నాగార్జున, నర్సింహారావు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల బంద్‌కు డీవైఎఫ్ఐ మద్దతు



మాట్లాడుతున్న వీరబాబు

హుజూర్‌నగర్ : రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌కు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ మద్దతు ప్రకటించిందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మీసాల వీరబాబు తెలిపారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ సంఘ పట్టణ అధ్యక్షుడు ఇందిరాల నరేష్, సభ్యులు పవన్, సతీష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

నేరేడుచర్ల : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం చేపట్టబోయే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని హుజూర్‌నగర్ పీడీఎస్‌యూ డివిజన్ నాయకుడు మాతంగి విజయ్ కోరారు. మంగళవారం నేరేడుచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం నాయకులు అన్వేష్, దావీద్, గణేష్, రోహిత్, సాయి, సాయిరాం తదితరులున్నారు.

తీజ్ వేడుక



తీజ్ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో గల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం తీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గిరిజన సంప్రదాయ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ నాగజ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నేరేడుచర్లలో మాట్లాడుతున్న తహసీల్దార్ సైదులు

నేరేడుచర్ల : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సురగి సైదులు అన్నారు. మంగళవారం నేరేడుచర్ల తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలకు వచ్చే వరదలతో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడినా ఆయా శాఖల అధికారులు వెంటనే స్పందించి సమాచారం అందించాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు రానీయొద్దని, ఎలాంటి నష్టం జరగకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి, ఎస్ఐ రవీందర్, మండల వ్యవసాయ అధికారి జావేద్, ట్రాన్స్‌కో ఏఈ పందిరి శ్రీనివాస్, పెంచికల్‌దిన్న పీహెచ్‌సీ డాక్టర్ సౌమ్యశ్రీ, పశు వైద్యాధికారి నరేష్, ఎంపీఓ హరిసింగ్, ఏఈలు శ్రీనివాస్, నవీన్ తదితరులున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మునగాల: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ రమేష్‌దీనదయాళ్ కోరారు. మంగళవారం మునగాల మండలంలోని తాడువాయిలో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామంలో పలువురు విషజ్వరాల బారిన పడడంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా మురుగునీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని పల్లె దవాఖానాను సందర్శించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాము, ఉపాధి ఏపీఓ శైలజ, డీపీఎంఓ అమరేందర్, కోదాడ సబ్‌యూనిట్ అధికారి సురేందర్, పల్లె దవాఖానా వైద్యాధికారిణి వైష్ణవి, ఏఎన్ఎం సుచరిత, ఆశావర్కర్లు మాయూరి, కలమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోట ప్రవీణ్, జిల్లేపల్లి వినయ్, మాజీ జెడ్పీటీసీ కోల ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

గరిడేపల్లి: వర్షకాలం నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బండ కవిత అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం గరిడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ శాఖల అధికారులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి శ్యాంసుందర్, ఎంపీడీఓ సరోజ, వ్యవసాయ అధికారి ప్రీయతమ్‌కుమార్, పీఆర్‌ఏఈ కళ్యాణ్, ఏఎస్ఐ గౌరీశంకర్‌గౌడ్, మండల వైద్యఆరోగ్య శాఖ అధికారులు, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మోతె : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి సీతారాంనాయక్ అన్నారు. మంగళవారం మోతె మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సమన్వయ కమిటీ సమావేశం

మఠంపల్లి: మఠంపల్లిలోని మండల రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం కలెక్టర్ ఆదేశాలతో మండల స్థాయి అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. వర్షాలు, వరదలు, యూరియా పంపిణీ, ఎరువుల దుకాణాలు, అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల తనిఖీలు, పారిశుద్ధ్యం, కాలువలు, నీటిట్యాంకుల శుభ్రత, సీజనల్ వ్యాధులు వంటి అంశాలపై చర్చించినట్లు తహసీల్దార్ మంగా రాథోడ్ తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ వెంకటాచారి, ఏఓ శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఏఈ హరీష్‌రెడ్డి, ఏఈఓలు, నీటిపారుదల శాఖ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రహదారిపై గుంత పూడ్చివేత



నడిగూడెం నుంచి బరాఖత్‌గూడేనికి వెళ్లే రహదారిలో జరుగుతున్న మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

నడిగూడెం : మండల కేంద్రం నుంచి మునగాల మండలం బరాఖత్‌గూడేనికి వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉండడంతో మంగళవారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురించింది. నడిగూడెంకు చెందిన కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వేపూరి తిరుపతమ్మ స్పందించి, సంబంధిత రోడ్లు భవనాల శాఖ అధికారులతో మాట్లాడారు. రోడ్డుపై ఉన్న గుంతలను కంకరతో పూడ్చించారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ

నడిగూడెం : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సిరిపురం పశువైద్యాధికారి డాక్టర్ మాదుపల్లి రవి కుమార్ అన్నారు. మంగళవారం నడిగూడెం మండల పరిధిలోని సిరిపురంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఎస్‌కే లతీఫ్, శ్రీను, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

మేళ్లచెరువు : స్థానిక ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు బొబ్బా భాగ్యారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పత్తిపాటి విజయ్ అన్నారు. మంగళవారం చింతలపాలెం మండలం దొండపాడు గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీ బలోపేతానికి కీలక అవకాశంగా ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రభారీ బాలవెంకటేశ్వర్లు, కాటిబోయిన లింగరాజు యాదవ్, బండారు నాగరాజు, రమేష్, వెంకటేశ్వర్లు, నర్సింహారావు, మస్తాన్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సిబ్బంది కొరత

- రూ.1.56కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణం
- 18మంది సిబ్బందికి 9మంది మాత్రమే విధులు



మునగాలలో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనం

మునగాల: మండల కేంద్రంలో రూ.1.56కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనంలో సిబ్బంది కొరతతో పాటు సౌకర్యాలు లేకపోవడంతో కేంద్రానికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులతో పాటు వివిధ కేటగిరిల్లో 18మంది సిబ్బంది ఉండాలి. కానీ ప్రస్తుతం 9మంది సిబ్బంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు ఉండగా ఇటీవల మహిళా వైద్యాధికారిణిని డిప్యుటేషన్‌పై మరో కేంద్రానికి బదిలీ చేశారు. కాగా ఇద్దరు స్టాఫ్ నర్సులు ఉండాల్సి ఉండగా ఒకరు మాత్రమే ఉన్నారు. ఒక ఫార్మాసిస్టు, ఎంపీహెచ్‌ఏ(మల్), ఎంపీహెచ్‌ఏ (ఫిమేల్), దోభి, తోటి, ఎంఎన్‌ఓ, వాటర్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ కేంద్రంలో నిత్యం 100 వరకు ఓపీ నమోదవుతోంది.

సౌకర్యాలు నిల్..

మూడు నెలల క్రితం ప్రారంభించిన పీహెచ్‌సీ భవనంలో కనీసం సిబ్బంది కూర్చునేందుకు ఫర్నిచర్ కూడా లేదు. ల్యాబ్ సౌకర్యం లేకపోవడంతో నిత్యం రక్తపరీక్షల కోసం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది. జాతీయ రహదారిపై ఉన్న ఈ కేంద్రంలో అన్ని వసతి సౌకర్యాలు కల్పించి, పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సిబ్బందిని నియమించాలి



స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రంలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేవు. ఈ కేంద్రంలో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి, సౌకర్యాలు కల్పించాలి.

– చింతకాయల నాగరాజు, బీసీ సంక్షేమ సంఘం మండల నాయకుడు, మునగాల

ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం



మునగాల పీహెచ్‌సీలో సిబ్బంది కొరత ఉన్నమాట వాస్తవమే. కేంద్రంలో 18మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 9మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. కేంద్రానికి రోగుల రాక ఎక్కువగానే ఉంటుంది. కేంద్రానికి ముఖ్యంగా మహిళా డాక్టర్ అవసరముంది. సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులకు నివేదిక అందించాం.

– రవీందర్, పీహెచ్‌సీ వైద్యాధికారి

ఆంజనేయస్వామికి తమలపాకు పూజ

హుజూర్‌నగర్ : మండలంలోని బూరుగడ్డలోగల శ్రీ ఆదివరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాలస్వామి దివ్య క్షేత్రంలో క్షేత్రపాలకుడు శ్రీ ఆంజనేయస్వామికి మంగళవారం గంధ సింధూరం, 108 తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. తొలుత పంచామృతాలతో అభిషేకించి ప్రసాద నివేదన గావించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, చైర్మన్, ధర్మకర్తలు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో అన్నదానం

కోదాడరూరల్ : పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ఆవరణలో కొలువుదీరిన అభయాంజనేస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు వీడాల వీరభద్రరావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దాతలు సరస్వతి, భారతీ, అంజలి, మాధవి, సంధ్యారాణి, నిర్వాహకులు ఉన్నారు.